


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 04-08-2026 సంపుటి: 08 సంచిక 51 పేజీలు: 8 వెల: రూ 3-00



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787


## డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలి: సీఎం చంద్రబాబు



అమరావతి, ఆగస్టు 3 : అన్ని శాఖల్లో డేటా ఆధారిత పాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్‌టీజీఎస్‌లో డేటా ఆధారిత నిర్ణయాలపై సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. పై అధికారులకు సీఎం మార్గనిర్దేశం చేశారు. సీఎం సమీక్షకు ఏపీ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఐటీ, ఆర్‌టీజీఎస్, వ్యవసాయం, మున్సిపల్, సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆర్‌టీజీ ద్వారా పాలన మరింత సమర్థవంతంగా, సులభంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలతో డేటా వినియోగాన్ని పెంచాలని ఆదేశించారు. ఆయా శాఖల వారీగా డేటా సమన్వయంపై అధికారులతో సీఎం చంద్రబాబు చర్చించారు.

## జగన్ సిగ్గులేకుండా విరూపాక్షిని సమర్థిస్తున్నారు.. మంత్రి ధ్వజం



అమరావతి, ఆగస్టు 3 (: వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపె ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే విరూపాక్షి చేసిన ఘోరాన్ని ఖండించకపోగా... జగన్ సిగ్గులేకుండా సమర్థిస్తున్నారని ధ్వజమెత్తారు. దళిత, బీసీ వర్గాలకు చెందిన మహిళ దుస్తులు చింపి, దుశ్శాసనుడిలా వైసీపీ ఎమ్మెల్యే ప్రవర్తించారని దుయ్యబట్టారు. అమరావతి వేదికగా మీడియాతో కొలుసు పార్థసారథి మాట్లాడారు. గొడ్డలి పార్టీ అరాచకాలను గమనిస్తున్న ప్రజలు ఆ పార్టీని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు యువత భవిష్యత్తు కోసం శ్రమిస్తుంటే గొడ్డలి పార్టీ వారి జీవితాలను నాశనం చేస్తోందని కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు. ప్రజాసేవ కాదని.. అరాచకాలు, నేరాలు చేయడమే గొడ్డలి పార్టీలో కొనసాగడానికి ముఖ్య అర్హత అని ఎద్దేవా చేశారు. ఎంత పెద్ద అరాచకాలు సృష్టిస్తే... జగన్ రెడ్డి దగ్గర అంత ప్రాధాన్యం లభిస్తుందని విమర్శించారు. నేరాలు చేసి దొరికిపోయాక 'రాజకీయ కక్ష సాధింపు' అంటూ సింపతీ డ్రామాలు ఆడటం వీరికి అలవాటేనని సెటైర్లు గుప్పించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్క అరాచక శక్తిని వదలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. 45 ఏళ్లు దాటిన పేదవాడికి బతికే అర్హత లేదన్నట్లుగా జగన్ మాట్లాడారని ఆగ్రహించారు. శ్రీకాకుళంలో మహిళా పోలీసు మీద దుశ్శాసనుడి పర్వం కొనసాగించారని ధ్వజమెత్తారు. బలహీన వర్గానికి చెందిన యువకుడిని చచ్చేలా కొట్టారని కొలుసు పార్థసారథి ఫైర్ అయ్యారు. ఆడకూతురిపై రాక్షస దాడికి తెగబడిన దుశ్శాసనుడిని... బాధితుడిగా చిత్రీకరించేందుకు గొడ్డలి పార్టీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. కిడ్నాప్ చేసిన, మహిళలను, సీఎంను, హోంమంత్రిని అవమానించిన, అభ్యంతరకరంగా మాట్లాడిన గొడ్డలి పార్టీ అధినేత ఎందుకు ఖండించరని ప్రశ్నించారు. ప్రజలు వైసీపీని ఘోరంగా తిరస్కరించి గద్దె దించినా ఈ పార్టీ మూకలకు ఇంకా బుద్ధి రాలేదని హెచ్చరించారు. దళిత వర్గాలకు చెందిన మహిళల దుస్తులు చింపేంతటి నీచమైన సంస్కృతిని జగన్ రెడ్డి ఎందుకు ఖండించడం లేదు? అని మంత్రి కొలుసు పార్థసారథి ధ్వజమెత్తారు.

## సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు బిల్లుకు లోక్‌సభ ఆమోదం

సీజేఐతో సహా సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కి పెంచుతూ ఆర్డినెన్స్ స్థానే ప్రవేశపెట్టిన బిల్లుకు లోక్‌సభ సోమవారంనాడు ఆమోదం తెలిపింది. నీట్ పేపర్ లీక్, అయోధ్య రామాలయం నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విపక్ష సభ్యులు ఆందోళన కొనసాగించడంతో చర్చ లేకుండానే బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. ఆర్డినెన్స్ జారీని వ్యతిరేకిస్తూ విపక్షాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సైతం మూజువాణి ఓటుతో



సభ తోసిపుచ్చింది. గత వారం కూడా సభలో ఇదే తరహా పరిస్థితులు నెలకొనడంతో ఎలాంటి చర్చ లేకుండానే జనన మరణాల రిజిస్ట్రేషన్ సవరణ బిల్లును లోక్‌సభ ఆమోదించింది. సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్యను పెంచుతూ ప్రవేశపెట్టిన బిల్లు గురించి కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ సంక్షిప్తంగా సభకు వివరించారు. అనంతరం దీనిపై చర్చించాల్సిందిగా సభ్యులను సభాపతి ఓం బిర్లా కోరారు. అయితే విపక్షాలు నినాదాలు కొనసాగించడంతో బిల్లును సభాపతి ఓటింగ్‌కు పెట్టారు. దీంతో మూజువాణి ఓటుతో బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. అత్యున్నత న్యాయస్థానం జడ్జిల సంఖ్యను పెంచేందుకు గత మేలో కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అనంతరం దీనిపై ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. పెంచిన సంఖ్యకు అనుగుణంగా సుప్రీంకోర్టుకు ఐదుగురు జడ్జీలను నియమించింది. సహజంగా ప్రభుత్వ ఆర్డినెన్స్ గడువు ఆరు నెలలు మాత్రమే ఉంటుంది. అయితే పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైన తర్వాత ఆరు వారాలు లేదా 42 రోజుల్లోగా ఆర్డినెన్స్‌ను చట్టంగా ఆమోదించాల్సి ఉంటుంది.

## విద్యార్థులపై కేసులు ఉండవు.. హామీపై కట్టుబడి ఉన్నాం: సుప్రీంకోర్టుకు కేంద్రం వివరణ



న్యూఢిల్లీ, విద్యార్థుల ఆందోళనల సందర్భంగా నమోదైన ఎఫ్ఐఆర్ (ఈఎఫ్ఐ)ల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీపై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. విద్యార్థులపై నమోదైన కేసులను ముందుకు తీసుకెళ్లబోమన్న తమ హామీకి కట్టుబడి ఉన్నామని ధర్మాసనానికి కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ హామీని అత్యంత బాధ్యతగా అమలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించిందివిచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వం కోర్టుకు ఇచ్చిన హామీ కేవలం మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ కనిపించాలని పేర్కొంది. గతంలో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా విద్యార్థులపై అనవసరమైన చట్టపరమైన చర్యలు కొనసాగించకూడదని సూచించింది. విద్యార్థులపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌ల దర్యాప్తు అంశంపై వివాదం కొనసాగుతుండటంతో, ప్రభుత్వం తన హామీని ఎలా అమలు చేస్తుందనే అంశంపై కోర్టు దృష్టి సారించిందిఇక విద్యార్థుల ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్న సీజేపీ మాత్రం ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అన్ని ఎఫ్ఐఆర్‌లను పూర్తిగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తోంది. హామీలు అమలు కాకపోతే దేశవ్యాప్తంగా మళ్లీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించింది.

## డ్వాక్రా మహిళలకు మరో గుడ్ న్యూస్..!

### ఛార్జీల మాఫీ, వడ్డీ రేటు తగ్గింపు..!



ఏపీలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. డ్వాక్రా సంఘాల ద్వారా ప్రభుత్వం నుంచి సాయం పొందుతున్న మహిళలకు మరింత లబ్ధి కలిగే విధంగా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా గ్రామీణ బ్యాంకుల్లో భారంగా మారిన సర్వీస్ ఛార్జీలతో పాటు రుణాలపై వడ్డీ రేట్ల నుంచి ఊరట కల్పించింది. దీంతో డ్వాక్రా సంఘాల మహిళలు ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుల్లో స్వయం సహాయక సంఘాల రుణాలపై అన్ని సేవా ఛార్జీల్ని మాఫీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే రూ.5 లక్షలు పైబడిన స్వయం సహాయక సంఘాల రుణాలపై వడ్డీని 13% నుంచి 12%కు తగ్గించారు. సీఎం చంద్రబాబు చొరవ, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కృషితో ఈ నిర్ణయం అమల్లోకి వచ్చిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీంతో గ్రామీణ బ్యాంకుల్లో ఇకపై రుణాలు మరింత సులభతరం కానున్నాయి. ప్రభుత్వం గ్రామీణ బ్యాంకుల్లో రద్దు చేసిన వాటిలో రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంటేషన్, ఇన్‌స్పెక్షన్, పాస్‌బుక్, లెడ్జర్, క్యాష్ హ్యాండ్లింగ్ వంటి ఛార్జులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతీ స్వయం సహాయక సంఘానికీ ఏడాదికి 25 వేల వరకూ లబ్ధి కలుగుతుందని అంచనా వేస్తున్నారు. అలాగే గ్రామీణ బ్యాంకుల్లోని సుమారు 2.75 లక్షల మహిళా సంఘాలకు భారీ ప్రయోజనం కలుగుతుందని అంచనా. ఇప్పటికే డ్వాక్రా సంఘాల్ని బలోపేతం చేయడంతో పాటు వారి ఉత్పత్తులకు అంతర్జాతీయంగా మార్కెటింగ్ కల్పించేందుకు ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. వీటికి కొనసాగింపుగా ఇప్పుడు ఈ నిర్ణయాలు వెలువడ్డాయి.

## మంత్రి సుభాశ్ చొరవ.. ఆ వ్యాధితో బాధపడుతున్న బాలుడికి శస్త్రచికిత్స

అమరావతి, ఆగస్టు 3 : ఫ్యాన్‌కోనీ అనీమియాతో బాధపడుతున్న బాలుడికి అండగా ఏపీ మంత్రి వాసంశెట్టి సుభాశ్ నిలిచారు. రూ.20 లక్షల బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. హైదరాబాద్ బసవతారకం ఆస్పత్రిలో చరణ్ తేజ పవన్‌కు శస్త్రచికిత్స నిర్వహించనున్నారు. బోన్ మ్యారో దాత నుంచి సేకరణ ప్రక్రియ విజయవంతమైంది. పేద కుటుంబానికి సహాయం అందించేందుకు మంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. దాతలు, సేవా సంస్థల సహకారంతో చికిత్సకు నిధులను మంత్రి సుభాశ్ సమీకరించారు. సహారా హెల్త్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ నుంచి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఈ చికిత్సలో భాగమైన వైద్యులు, ఆస్పత్రి యాజమాన్యానికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. చరణ్ తేజ పవన్ పూర్తిగా కోలుకోవాలని భగవంతుడిని మంత్రి సుభాశ్ ప్రార్థించారు.


ఆళ్ళగడ్డ ప్రజలకు శుభవార్త!
ఆవుల ఫుడ్ కాంప్లెక్స్



రాగి రొట్టె సద్ద రొట్టె జొన్న రొట్టె కారం రొట్టె
మా వద్ద స్వచ్ఛమైన, కల్తీలేని నాణ్యమైన జొన్నరొట్టె
రాగి రొట్టె, సద్ద రొట్టె, కారం రొట్టె లభించును.
ధర కేవలం 10/- మాత్రమే
కారం రొట్టె 15/- మాత్రమే
అన్ని రకముల శుభకార్యములకు ఆర్డర్లపై సప్లయ్ చేయబడును.
తప్పక విచ్చేయండి... ఆవుల ఫుడ్ కాంప్లెక్స్
ఆవుల విజయభాస్కర్‌రెడ్డి కాంప్లెక్స్ పైన,
4 రోడ్స్ సెంటర్, కోవెలకుంట్ల రోడ్డు, ఆళ్ళగడ్డ.
Cell : 8332889900 ప్రొ॥ ఆవుల విజయభాస్కర్ రెడ్డి అడ్వకేట్ ఆళ్ళగడ్డ.
ఉదయం 11-00 నుండి మధ్యాహ్నం 2-00 గం॥ వరకు
సాయంత్రం 6-30 నుండి రాత్రి 8-30 గం॥వరకు
@Padmasree Printers, Allagadda : 9951261617

# సంపాదకీయం

మంగళవారం 04-08-2026

## 2 లక్షల కోట్లు దాటేస్తున్న జీఎస్టీ

దేశంలో వస్తు సేవల పన్ను సూళ్లు ఇటీవల రూ. 2 లక్షల కోట్ల మైలురాయిని దాటింది. సాధారణంగా జీఎస్టీ రేట్ల ల్యాండ్‌స్కేప్‌లో సంస్కరణలు , రేట్ల సర్దుబాట్లు చేసిన తర్వాత స్వల్పకాలంలో పన్ను ఆదాయం తగ్గుతుందనే అంచనాలు ఉండేవి. అయితే, అనుకున్నదానికి భిన్నంగా రాబడి ప్రతి నెలా పెరుగుతూ వస్తోంది. కేంద్ర ప్రభుత్వం దీనిని పన్ను వ్యవస్థలో పారదర్శకత, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి నిదర్శనంగా చూపుతున్నప్పటికీ.. నాణేనికి మరోవైపు ఉన్న పన్ను రాబడి స్వభావాన్ని లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉంది.ఆర్థిక సూత్రాల ప్రకారం, జీఎస్టీ అనేది అడ్ వలోరమ్ పన్ను. అంటే, ఇది ఒక వస్తువు లేదా సేవ తుది విక్రయ ధరపై శాతంగా లెక్కిస్తారు. అంటే ఓ వస్తువు ధర వంద రుపాయలు అయితే దానిపై ట్యాక్స్ 18 శాతం అయితే .. పద్దెనిమిది రూపాయల ట్యాక్స్ కట్టాలి. మార్కెట్‌లో వస్తువుల ధరలు పెరిగినప్పుడు పన్ను శాతం మారకపోయినప్పటికీ, ప్రభుత్వానికి వచే పన్ను మొత్తం ఆటోమేటిక్‌గా పెరుగుతుంది. ఉదాహరణకు, రూ. 100 విలువైన వస్తువుపై 18% జీఎస్టీ పడితే ప్రభుత్వానికి రూ. 18 వస్తుంది. కానీ ద్రవ్యోల్బణం వల్ల అదే వస్తువు ధర రూ. 150కి పెరిగితే, అదే 18% చొప్పున ప్రభుత్వానికి రూ. 27 పన్ను సమకూరుతుంది. అంటే వ్యాపారం లేదా వస్తువుల వినియోగ పరిమాణం పెరగకపోయినా, కేవలం ధరల పెరుగుదల వల్ల కూడా పన్ను వసూళ్లు గణనీయంగా పెరుగుతాయి.ఇటీవలి కాలంలో అంతర్జాతీయంగా అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన సంరక్షణాత్మక వాణిజ్య విధానాలు, సుంకాల యుద్ధాలు, గ్లోబల్ సప్లై చైన్ సమస్యల వల్ల అంతర్జాతీయ మార్కెట్లో చమురు, సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీని ప్రభావం భారతీయ మార్కెట్‌పై కూడా పడి నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్స్, ముడిసరుకుల ధరలు పెరగడానికి దారితీసింది. ఆసియా, ఐరోపా మార్కెట్లలో రేగన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు వ్యాపార వ్యయాన్ని పెంచడంతో.. ఆ భారం అంతిమంగా వినియోగదారుడిపై పడింది. ధరలు పెరగడం వల్ల ప్రజల జేబుల నుంచి ఎక్కువ సొమ్ము పన్నుల రూపంలో ప్రభుత్వ ఖజానాకు చేరుతోంది.కేవలం రూ. 2 లక్షల కోట్ల జీఎస్టీ రికార్డు కలెక్షన్లను మాత్రమే చూసి దేశంలో ప్రగతి ఉప్పొంగిపోతోందని తీర్మానించడం సమగ్రమైన విశ్లేషణ కాదు. ఈ రాబడిలో ఎంత భాగం నిజమైన ఆర్థిక వృద్ధి ద్వారా వచ్చింది, ఎంత భాగం ద్రవ్యోల్బణం వల్ల పెరిగిందో వేరు చేసి చూడాలి. ఒకవైపు ధరల భారంతో సామాన్య ప్రజల కొనుగోలు శక్తిపై ప్రభావం పడుతుంటే, మరోవైపు అదే ధరల పెరుగుదల ప్రభుత్వానికి రికార్డు రాబడిని తెచ్చిపెడుతోంది. జూలై నెలకు సంబంధించి రీఫండ్‌లు కూడా 13.1 శాతం పెరిగి, రూ.29,968 కోట్లకు చేరాయి. విదేశీ దిగుమతుల ద్వారా జీఎస్టీ రెవెన్యూ 28.8 శాతం పెరిగింది. వరుసగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంకేతం అని నిపుణులు అంటున్నారు. జీఎస్టీ వసూళ్లలో హరియాణా అత్యధిక వృద్ధి సాధించింది. అదే సమయంలో గుజరాత్ రెండో స్థానంలో, తెలంగాణ కూడా భారీ వృద్ధి (19 శాతం) నమోదు చేసింది. మరోవైపు ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లపై ఆర్బీఐ అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్ అమలు చేయనున్నట్లు చెప్పింది.దీనిప్రకారం.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (కమర్షియల్ బ్యాంక్స్-ఇంటరెస్ట్ రేట్ ఆన్ డిపాజిట్స్) సెకండ్ అమెండ్‌మెంట్ డైరెక్షన్స్, 2026 ప్రకారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా ఒక రోజున కస్టమర్లు డిపాజిట్ చేసే మొత్తాలకు, ఒక అమౌంట్‌కు అన్ని బ్రాంచులలో ఒకే వడ్డీ రేటు చెల్లించాలని ఆదేశించింది. బల్క్ డిపాజిట్లతోపాటు అన్ని రకాల డిపాజిట్లపై వేర్వేరు బ్రాంచుల్లో అయినా సరే ఒక అమౌంట్‌కు, ఒకే రకమైన వడ్డీ చెల్లించాలని, ఈ విషయంలో వివక్ష ఉండకూడదని కూడా ఆర్బీఐ ఆదేశించిందిపన్ను సంస్కరణలతో పాటు పన్ను నిఘా పెరగడం సానుకూలాంశమే అయినప్పటికీ, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల వల్ల పెరుగుతున్న పన్ను భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కలిగించే చర్యలపై దృష్టి సారించడమే నిజమైన ఆర్థిక నిర్వహణ అవుతుంది

# ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల మందిపై నిఘా వేసిన చైనా..!

చైనా ప్రపంచవ్యాప్తంగా 140 కోట్లకుపైగా ప్రజలపై నిఘా పెట్టినట్లు అమెరికా కు చెందిన ఓ పత్రిక సంచలన కథనాన్ని వెలువరించింది. ఆ దేశ నిఘాలోని వారిలో సొంత పౌరులు సహా సందర్శనకు వచ్చిన విదేశీయులు కూడా ఉన్నట్లు తెలిపింది.అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. చైనా తన సొంత ప్రజలపై ఎలా నిఘా పెడుతుందో తెలుసుకోవడానికి జనవరిలో మార్క్ హోఫర్ అనే సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు ఇంటర్నెట్‌లో వెతుకుతుండగా.. 'డైనమిక్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఓవర్సీస్ పర్సనల్' అనే వెబ్‌సైట్‌లో తన పేరు, ఫొటో, పాస్‌పోర్ట్ సంఖ్య, గతంలో చైనా పర్యటన సమయంలో ఉపయోగించిన మొబైల్ నంబర్ సహా అన్ని వివరాలు



కనిపించడంతో గ్భ్రాంతికి గురయ్యారు.ఆ వెబ్‌సైట్‌లో ముఖ్యంగా చైనాలోని జాంగ్‌జియాకోవు నగరానికి వెళ్లిన విదేశీయుల వివరాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వారిలో భారత్, తైవాన్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, బ్రిటన్, అమెరికా, ఈజిప్ట్, ఇరాన్, ఇజ్రాయెల్, మొరాకో, పాకిస్థాన్, సూడాన్ ప్రజలు ఉన్నట్లు తెలుస్తోంది. జాంగ్‌జియాకోవు హెబే నార్త్ యూనివర్సిటీలో చేరిన విదేశీ విద్యార్థుల సమాచారం కూడా ఇందులో ఉంది. అయితే వారిలో భారత్, పాక్‌కు చెందిన వారే అధికం కావడం గమనార్హం.ఆ వెబ్‌సైట్‌లో వారి వ్యక్తిగత వివరాలు సహా వారు ఎక్కడెక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారనే సమాచారం నమోదై ఉన్నది. వీరందరినీ చైనా అధికారులు కెమెరాలు, ఫోన్ సిగ్నల్స్ ద్వారా ట్రాక్ చేస్తున్నారు. వారందరూ స్వదేశాలకు వెళ్లాక కూడా ఈ నిఘా కొనసాగుతుండడం గమనార్హం. చైనాలోని పోలీస్ విభాగాలకు రోబోటిక్స్, నిఘా పరికరాలను విక్రయించే 'ఆరిజిన్ డైనమిక్' అనే సంస్థకు కూడా ఈ వెబ్‌సైట్‌తో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ డేటా అక్కడి పోలీసులకు అందుబాటులో ఉంది. ప్రజలు ఎక్కిన విమానాలు, వారి సీటు నెంబరు, రైళ్ల వివరాలు అందులో అందుబాటులో ఉన్నాయి.2019లో హాంకాంగ్‌లో భారీ స్థాయిలో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు చెలరేగినప్పటి నుంచి అక్కడి ప్రభుత్వం నిఘాను మరింత పెంచింది. దేశ ప్రజల విదేశీ భాగస్వాములపైనా ప్రత్యేక నిఘా ఉంచింది. అయితే ఈ సైట్‌లోని సమాచారమంతా మే నెలలో అదృశ్యం కావడం గమనార్హం. సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు మార్క్ హోఫర్ అప్పటికే వెబ్‌సైట్‌లోని డేటాను డౌన్‌లోడ్ చేసుకోవడంతో ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కథనాలపై చైనా నుంచి ఎటువంటి అధికారిక స్పందన రాలేదు.

# సహజీవనంపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు..

## అలాంటి భాగస్వామిపై క్రిమినల్ కేసులు..

ఢిల్లీ: సహజీవనం అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. సహజీవనంలో భాగస్వామిని వేధింపులకు గురి చేస్తే భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ)లోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టం చేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. వివాహం జరగలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్.కోటిశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది.ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవన చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం పేర్కొంది. అయితే, అన్ని రకాల సహజీవనాలకు



ఈ తీర్పు వర్తించదని స్పష్టం చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498-ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అలాగే, ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498-ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబ సభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తు చేసింది. అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది.వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది. ఆ విధంగా భాగస్వామిని ఎంచుకున్న మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించలేమని పేర్కొంది. సహజీవనం చేస్తున్న మహిళకు తన భాగస్వామి లేదా అతని కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు ఎదురైతే ఆమెకు కూడా సమాన చట్టపరమైన రక్షణ కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

# లైంగిక వేధింపుల కేసు.. కేంద్రంపై ప్రియాంక గాంధీ విమర్శలు..

ఢిల్లీ, ఆగస్టు 3: మాజీ భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్, మాజీ డబ్ల్యూఎఫ్ఐ అసిస్టెంట్ సెక్రటరీ వినోద్ తోమర్‌లను లైంగిక వేధింపుల కేసులో కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ అంశంపై ఇవాళ (సోమవారం) మీడియాతో మాట్లాడిన ప్రియాంక.. మహిళల భద్రత, సాధికారత గురించి కేంద్ర ప్రభుత్వం ఒకవైపు గొప్పలు చెప్పుకొంటుంటే, మరోవైపు ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోవడం విడ్డూరమని వ్యాఖ్యానించారు.'ఒకవైపు యువతకు అండగా ఉన్నామని, మహిళా సాధికారత, మహిళా రిజర్వేషన్ల గురించి మాట్లాడుతారు. మరోవైపు ఇలాంటి పరిస్థితులు నెలకొంటున్నాయి' అని ప్రియాంక గాంధీ అన్నారు.అటు, కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ కూడా కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ప్రతిపక్షం లేవనెత్తుతున్న అంశాలపై పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం ముందుకు రావడం లేదని ఆరోపించారు. ప్రత్యేకంగా.. కేంద్ర హోంమంత్రి పార్లమెంట్‌కు హాజరుకాకపోవడాన్ని ప్రశ్నించిన ఆయన, గత పార్లమెంట్ సమావేశాల్లో చురుకుగా పాల్గొన్న హోంమంత్రి ఈసారి ఎందుకు సభకు రావడం లేదని నిలదీశారు.అలాగే అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగం అంశంపై కూడా ప్రభుత్వం చర్చకు సిద్ధంగా లేదని ఆరోపించారు. విరాళాల దుర్వినియోగంపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేసులు నమోదు చేస్తున్నారని, అసలు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదని కేసీ వేణుగోపాల్ విమర్శించారు.ఈ కేసు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణలతో ప్రారంభమైంది. 2023లో ఢిల్లీ పోలీసులు ఆయనపై లైంగిక వేధింపులు, మహిళలపై దాడి, బెదిరింపులు తదితర అభియోగాలతో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో వినోద్ తోమర్ కూడా సహ నిందితుడిగా ఉన్నారు.



# రామమందిర విరాళాల చోరీపై.. పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఎంపీల నిరసన



న్యూఢిల్లీ: అయోధ్యలోని రామమందిర విరాళాల చోరీపై ప్రతిపక్ష ఎంపీలు సోమవారం కూడా నిరసన కొనసాగించారు. రామ మందిరం విరాళాల చోరీతో పాటు విద్యార్థి నిరసనకారులపై పోలీసుల బలప్రయోగంపై పార్లమెంట్ ప్రాంగణంలోని మకర ద్వారం ముందు నిరసన చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా, ఎస్పీకి చెందిన డింపుల్ యాదవ్, ధర్మేంద్ర యాదవ్, టీఎంసీకి చెందిన మహువా మోయిత్రా, జేఎంఎంకు చెందిన మహువా మాఝీ, ఆర్ఎస్‌పీకి చెందిన ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ తదితర ఎంపీలు ఈ నిరసనలో పాల్గొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌కు ఎందుకు రావడం లేదు? అన్న పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించడంతోపాటు నినాదాలు చేశారు.కాగా, రామమందిరంలో విరాళాల చోరీకి ప్రతీకగా విరాళాల పెట్టెలను పార్లమెంట్ ఆవరణలో ఉంచారు. ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వాటి చుట్టూ బారులు తీరారు. కొందరు ఎంపీలు విరాళాల పెట్టెలో నగదు కూడా వేశారు. ఆ తర్వాత విరాళాల ఆదాయం లెక్కింపు సందర్భంగా చోరీ చేయడాన్ని ప్రతీతాత్మకంగా ప్రదర్శించారు.

# వ్యవస్థ మొత్తం బ్రిజ్ భూషణ్‌నే కాపాడుతుంది: వినేశ్ ఫోగట్



బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులపై మూడేళ్ల క్రితం మహిళా రెజ్లర్లు చేపట్టిన నిరసనలు దేశంలో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. వీరి పోరాట ఫలితంగా బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం ఢిల్లీ కోర్టు బ్రిజ్ భూషణ్‌కు క్లీన్ చిట్ ఇస్తూ తీర్పు వెలువరించింది. దీనిపై వినేశ్ ఫోగట్ స్పందిస్తూ.. బ్రిజ్ భూష్‌ణ్‌ను రక్షించడానికి వ్యవస్థ మొత్తం పనిచేసిందని ఆరోపించారు. దీనిపై న్యాయపోరాటాన్ని కొనసాగిస్తామని వెల్లడించారు. మహిళా రెజ్లర్లు తమ పోరాటాన్ని విడిచిపెట్టరని, ఢిల్లీ కోర్టు తీర్పుపై అప్పీల్‌కు వెళతామని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంలో ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేయాలని తమ లీగల్ టీమ్‌కు సూచించామని వెల్లడించారు.అధికార పార్టీకి చెందిన ప్రముఖ నాయకుడిపై ఎఫ్ఐఆర్ (ఈఎఫ్ఐ) నమోదు చేయించడానికి ధైర్యాన్ని కూడగట్టుకుని వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టాం. కేసు వాపసు తీసుకోమని అతడు తన పలుకుబడితో, కండబలంతో ఫిర్యాదుదారులను బెదిరించాడని ఆమె ఆరోపించారు. అయినా భయపడకుండా తమ న్యాయపోరాటాన్ని కొనసాగించామని తెలిపారు. కానీ ఢిల్లీ కోర్టు అతడిని నిర్దోషిగా తేల్చడం మాకు తీవ్ర నిరాశను కలిగించిందని వాపోయారు. అయినా దీనిపై వెనుకడుగు వేయమని, న్యాయం జరిగే వరకు పోరాడతామని పేర్కొన్నారు.

# ఇకపై జంతర్ మంతర్ వద్ద ఆందోళనలు, నిరసనలు బంద్

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనల నిర్వహణపై సోమవారం సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. నిరసనల నిర్వహణకు జంతర్ మంతర్ సరైన ప్రదేశం కాదంటూ సతీష్ చంద్ కౌశిక్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది.జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న నిరసనల కారణంగా స్థానిక ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. నిత్యావసర వస్తువుల సరఫరాకు, వైద్య సేవలకు ఆటంకం కలుగుతోందని సతీష్ చంద్ కౌశిక్ కోర్టుకు వివరించారు. ధర్నాలు, ఆందోళనలు నిర్వహించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. పిటిషనర్ వాదనలు విన్న కోర్టు నిరసనలకు ప్రత్యామ్నాయ వేదిక కేటాయింపుపై కేంద్రాన్ని సంప్రదించాలని సొలిసిటర్ జనరల్‌కు సూచించింది.



# జెన్ జీ టచ్ లో జనసేన

జనసేన పార్టీ

కాకినాడ, ఆగస్టు 3, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా జెన్ జీ యువత కేంద్రంగా రాజకీయ పరిస్థితులు మారుతున్నాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీని సైతం అదే ఆధునిక స్థాయిలో తీర్చిదిద్దాలని పవన్ గట్టిగా భావిస్తున్నారు. కేవలం పాత పద్ధతుల్లో కాకుండా మారుతున్న టెక్నాలజీ, సోషల్ మీడియా, సరికొత్త ఆలోచన విధానాలకు అనుగుణంగా పార్టీ యంత్రాంగాన్ని మార్పులు చేస్తున్నారు. ఇందులో భాగంగానే రాష్ట్ర అధికార ప్రతినిధుల కమిటీని రద్దు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 మంది నాయకులను వారి బాధ్యతల నుంచి తప్పించారు. నూతన నియామకాలు పూర్తి అయ్యే వరకు టీవీ డిబేట్లు, మీడియా సమావేశాలలో ఎవరూ పాల్గొనవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పార్టీ సంస్థాగత ప్రక్షాళన దిశగా ఈ నిర్ణయం చాలా కీలకమైన అడుగుగా రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ సమూల మార్పులు చేపడుతున్నారు. ఇప్పటికే ప్రకాశం అలాగే నెల్లూరు జిల్లాల కమిటీలను రద్దు చేసిన అధినాయకత్వం, పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా కొత్త కమిటీల బాధ్యతలను క్షేత్రస్థాయి క్యాడర్ కు అప్పగిస్తోంది. ఈ వరుస నిర్ణయాల కొనసాగింపుగానే ఇప్పుడు రాష్ట్రస్థాయి అధికార ప్రతినిధుల కమిటీని పూర్తిగా రద్దు చేయడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలలో జనసేనకు ప్రాతినిధ్యం వహిస్తున్న 26 మంది అధికార ప్రతినిధుల బాధ్యతలను హైకమాండ్ ఉపసంహరించుకుంది. కొత్త కమిటీల నియామకం జరిగే వరకు మీడియా ముందుకు వచ్చి మాట్లాడకూడదని కఠిన నిబంధనలు పెట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల సమయానికి పార్టీని పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయడమే ఈ ప్రక్షాళన ముఖ్య ఉద్దేశం. క్షేత్రస్థాయి నుంచి నాయకులను చురుగ్గా ఉంచడానికి ఈ కఠినమైన నిర్ణయాలు ఎంతగానో ఉపయోగపడతాయని పార్టీ భావిస్తోంది.జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి యువతకు ఎప్పుడూ పెద్దపీట వేస్తూ వస్తున్నారు పవన్ కళ్యాణ్. అయితే ప్రస్తుత జెన్ జీ ట్రెండ్‌కి తగినట్లుగా పోరాటాలకు సిద్ధంగా ఉండే నాయకత్వాన్ని తయారు చేయాలని కోరుకుంటున్నారు. కొత్త తరపు గొంతుక పార్టీలో స్పష్టంగా వినిపించాలనే లక్ష్యంతో ఈసారి మరింత ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పూర్తిగా ప్రక్షాళన చేసే పనిలో పడ్డ ఆయన కొత్త కమిటీల నియామకం పై సుదీర్ఘంగా కసరత్తు చేస్తున్నారు. ఈసారి కేవలం రాజకీయ నాయకులే కాకుండా చదువుకున్న విద్యాధికులతో పాటు ఐటీ ఉద్యోగులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నారు. అన్ని సామాజిక వర్గాల వారికి తగిన స్థానం కల్పించడం ద్వారా ప్రజల్లోకి బలమైన సంకేతాలు పంపాలని చూస్తున్నారు. వచ్చే నెలలో ఈ కొత్త కమిటీల పూర్తి జాబితాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. యువత శక్తిని పూర్తిగా వినియోగించుకోవడం ద్వారా పార్టీ భవిష్యత్తును మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో అడుగులు పడుతున్నాయి.దేశ రాజకీయాలను ఇటీవల కాలంలో జెన్ జీ తరహా ఉద్యమాలు ఒక కుదుపు కుదిపేశాయి. ఆ స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీలో యువతతో పాటు చదువుకున్న టెక్కీలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించాలని సమాచారం అందుతోంది. ముఖ్యంగా ఐటీ రంగానికి చెందిన నిపుణులు, సామాజిక అంశాలపై పూర్తి అవగాహన ఉన్న యువ నాయకులను ప్రోత్సహించి కీలక బాధ్యతలు అప్పగించాలని ఆలోచిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం ఇస్తూ సామాజిక సమీకరణాలను సమతుల్యం చేయడమే ఈ కొత్త కమిటీల ప్రత్యేకతగా నిలవనుంది. కేవలం సాంప్రదాయ ధోరణులకు పరిమితం కాకుండా నేటి డిజిటల్ యువతకు సులభంగా అర్థమయ్యే రీతిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పవన్ కళ్యాణ్ కోరుకుంటున్నారు. ఈ ఆధునిక విధానం ద్వారా యువత పెద్ద ఎత్తున పార్టీ వైపు ఆకర్షితులు అవుతారని, రాబోయే ఎన్నికలలో ఇది పార్టీ విజయానికి ప్రధాన భూమిక పోషిస్తుందని అంతా భావిస్తున్నారు.మార్పు అనేది ఎప్పుడూ ఒక మంచి పరిణామం అని నమ్మే పవన్ కళ్యాణ్, జనసేన పార్టీలో చేస్తున్న ఈ ప్రక్షాళన భవిష్యత్తు రాజకీయాలకు ఒక దిక్సూచి కానుంది. టెక్నాలజీ యుగంలో దూసుకుపోతున్న నేటి తరానికి తగినట్లుగా పార్టీ యంత్రాంగాన్ని సంస్కరించడం ద్వారా సమాజంలో సరికొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతున్నారు. అనుభవజ్ఞులైన సీనియర్ల మార్గదర్శకత్వంలోనే ఉంటూనే, నిర్ణయాలు తీసుకునే అధికారంలో యువతకు పెద్దపీట వేయడం ఈ కొత్త కమిటీల ప్రధాన ఉద్దేశం. రాబోయే కాలంలో జరగబోయే ప్రతి ఎన్నికను సవాల్‌గా తీసుకుని కూటమి ప్రభుత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని జనసేన శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి. త్వరలో ప్రకటించబోయే కొత్త రాష్ట్ర కమిటీ జాబితా రాజకీయ వర్గాలలో పెను మార్పులకు కారణం కానుంది. పవన్ కళ్యాణ్ తీసుకున్న ఈ సాహసోపేతమైన నిర్ణయాలు పార్టీని ఏ విధంగా విజయతీరాలకు చేర్చుతాయనేది వేచి చూడాలి. ఏది ఏమైనా ఈ నిర్ణయం యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపింది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# పోతిన మహేష్ దారెటు...



విజయవాడ, ఆగస్టు 3,పోతిన మహేష్ ప్రస్తుతం వైసీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న యువ నాయకుడు. విజయవాడ రాజకీయాల్లో ఎదగాలని ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆయనకు మంచి పట్టు ఉంది. జనసేన పార్టీ ద్వారా రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. పవన్ కళ్యాణ్ వీరాభిమానిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆయన రాజకీయ భవితవ్యం సంకటంలో పడింది. గత ఎన్నికలలో పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆశించారు. కూటమి పొత్తులో భాగంగా ఈ స్థానం బీజేపీకి కేటాయించారు. దీంతో ఆయన తీవ్ర నిరాశకు గురయ్యారు. జనసేన పార్టీ వీడి వైసీపీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ ఆయనకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. భవిష్యత్తు రాజకీయాలపై ఆయన మదనపడుతున్నారు.విజయవాడ పశ్చిమ సీటుపై పోతిన మహేష్ భారీ ఆశలు పెట్టుకున్నారు. గడచిన ఎన్నికలలో టికెట్ రాలేదు. ఇప్పుడు కూడా అదే సీటు కోరుకుంటున్నారు. అయితే వైసీపీలోనూ బలమైన నాయకులు ఉన్నారు. మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు మళ్లీ అదే స్థానం ఆశిస్తున్నారు. దీంతో పోతిన మహేష్ పరిస్థితి క్లిష్టంగా మారింది. పార్టీ అధిష్టానం ఆయనకు గుంటూరు పార్లమెంట్ బాధ్యతలు అప్పగించింది. ఆ బాధ్యతల పట్ల ఆయన పెద్దగా ఆసక్తి చూపడం లేదు. తనకు పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ పదవి కావాలని కోరుతున్నారు. పార్టీ పెద్దలు ఆయన డిమాండ్ పట్టించుకోవడం లేదు. సొంత పార్టీలో తగిన గుర్తింపు లభించక సతమతమవుతున్నారు.వైసీపీలో తగిన ప్రాధాన్యం దక్కకపోవడంతో జనసేన నుంచి సంకేతాలు వస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పోతిన కోసం జనసేన తలుపులు తెరిచే ఉన్నాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఆయనను తిరిగి పార్టీలోకి ఆహ్వానించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. అయితే గతంలో పవన్ కళ్యాణ్ కుటుంబంపై పోతిన తీవ్ర విమర్శలు చేశారు. ఈ పరిణామం జనసేనలోని కొందరికి నచ్చడం లేదు. ఆయనను మళ్లీ పార్టీలో చేర్చుకోవడాన్ని కొందరు వ్యతిరేకిస్తున్నారు. పార్టీలో ఆయనకు స్థానం దక్కడం కష్టమని కొందరు నేతలు భావిస్తున్నారు. ఈ రాజకీయ పరిణామాలు ఆయనను తీవ్ర గందరగోళంలో నెట్టేశాయి.ప్రస్తుత రాజకీయ పరిస్థితులు గమనిస్తే పోతిన మహేష్ అడకత్తెరలో చెక్కపడ్డ చందంగా మారారు. వైసీపీలో ఉంటే పశ్చిమ సీటు దక్కేలా లేదు. జనసేనకు వెళితే గత విమర్శల కారణంగా వ్యతిరేకత ఎదురవుతోంది. రెండు పార్టీల మధ్య నలిగిపోతున్న ఆయన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. విజయవాడ రాజకీయాల్లో తన స్థానం సుస్థిరం చేసుకోవాలని ఆయన తపన పడుతున్నారు. కానీ పరిస్థితులు ఆయనకు అనుకూలంగా మారడం లేదు. అనుచరులు మాత్రం ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోకపోతే మరింత నష్టపోవాల్సి వస్తుంది.రాజకీయ ప్రయోజనాలు నెరవేరక పోవడంతో పోతిన మహేష్ తీవ్ర మానసిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ప్రత్యర్థుల వ్యూహాల కారణంగా ఆయన నియోజకవర్గంలో ఇబ్బంది పడుతున్నారు. ప్రజల్లోకి వెళ్దామంటే స్పష్టమైన హామీలు కరువయ్యాయి. భవిష్యత్తు కార్యాచరణపై సన్నిహితులతో చర్చిస్తున్నారు. ఏ పార్టీలో కొనసాగాలనేదానిపై త్వరలోనే స్పష్టత ఇస్తారని ప్రచారం జరుగుతోంది. విజయవాడ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ తరుణంలో ఆయన ఎలాంటి అడుగులు వేస్తారో చూడాలి. మొత్తంగా ఆయన రాజకీయం అత్యంత కీలకమైన మలుపు తిరిగింది.

# మళ్లీ వల్లభనేనికి కోర్టు తిప్పలు

విజయవాడ, ఆగస్టు 3, గన్నవరం నియోజకవర్గ రాజకీయాల్లో మట్టి దోపిడీ వ్యవహారం తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. గత ప్రభుత్వ కాలంలో జరిగిన అక్రమాలను ప్రస్తుత ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బహిర్గతం చేయడం పెద్ద చర్చకు దారితీసింది. పోలవరం కుడి కాలువ మట్టి తవ్వకాలు, ప్రభుత్వ పనుల కాంట్రాక్టులలో సాగిన అవినీతిని ఆయన బయటపెట్టారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పాలనలో జరిగిన ఈ దోపిడీపై విజిలెన్స్ నివేదికలు కూడా స్పష్టమైన నిజాలు వెల్లడించాయి. ఎలాంటి అనుమతులు లేకుండా కోట్ల విలువైన సహజ వనరులను తరలించారని ఆరోపణలు వస్తున్నాయి. నియోజకవర్గ ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతతోనే తాను ఈ నిజాలను బయటపెట్టానని యార్లగడ్డ గట్టిగా చెబుతున్నారు. ఈ పరిణామాలు స్థానిక రాజకీయాల్లో పెను మార్పులకు కారణం అవుతున్నాయి.అక్రమాలు బయటపడతాయనే భయంతో మాజీ ఎమ్మెల్యే వంశీ లీగల్ నోటీసుల మార్గాన్ని ఎంచుకున్నారు. తన పరువుకు భంగం కలిగిస్తున్నారంటూ ఆయన పంపుతున్న నోటీసులు కేవలం భయపెట్టే ప్రయత్నాలని కూటమి శ్రేణులు మండిపడుతున్నాయి. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని సాగించిన అరాచకాలను ప్రజలు ఇంకా మరచిపోలేదు. ఇప్పుడు అధికారం కోల్పోయాక చట్టపరమైన ముసుగులో తప్పించుకోవాలని చూడటం సరికాదని విమర్శకులు అభిప్రాయపడుతున్నాయి. కోర్టుల ద్వారా భయపెట్టి నోరు మూయించవచ్చనే ఆలోచన కేవలం భ్రమేనని స్థానిక నాయకులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా ఇలాంటి బెదిరింపులకు పాల్పడటం మాజీ ఎమ్మెల్యే రాజకీయ బలహీనతను స్పష్టంగా బయటపెడుతోంది.బెదిరింపులకు ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ధైర్యంగా ప్రకటిస్తున్నారు. చట్టబద్ధంగా ఏ వేదికపైనైనా ఈ దోపిడీని నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆయన తేల్చిచెప్పారు. కోర్టులకు వెళ్తే అసలు నిజాలు, మట్టి తవ్వకాలకు సంబంధించిన పక్కా ఆధారాలన్నీ బయటకు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించింది నియోజకవర్గాన్ని ప్రక్షాళన చేయడానికే తప్ప ఇలాంటి లీగల్ నోటీసులకు భయపడటానికి కాదని స్పష్టం చేశారు. ప్రజాక్షేత్రంలోనే తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పడం ద్వారా ఆయన తన పట్టును నిరూపించుకుంటున్నారు. ఈ రాజకీయ పోరు రానున్న రోజుల్లో మరింత ముదిరే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.గన్నవరం నియోజకవర్గ ప్రజలు గత ఐదేళ్ల పాలనలో జరిగిన అన్యాయాలను నిశితంగా గమనించారు. విమానాశ్రయం పరిసరాల్లో జరిగిన పనులలోనూ భారీ అవకతవకలు జరిగాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రాయల్టీ చెల్లించకుండా తరలించిన వేలాది ట్రక్కుల మట్టి లారీలు రోడ్లను ధ్వంసం చేశాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. యువత ఈ విషయాలను సోషల్ మీడియా వేదికగా విశ్లేషిస్తూ నిలదీస్తున్నారు. పాత తప్పులను కప్పిపుచ్చుకోవడానికి లీగల్ నోటీసులు పంపడం పట్ల ప్రజల్లో వ్యంగ్యమైన చర్చ నడుస్తోంది.



అభివృద్ధిని విస్మరించి కేవలం అక్రమ సంపాదన మీద దృష్టి పెట్టడం వల్లే నాయకులు ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని యువత భావిస్తున్నారు. ఈ పరిణామాలు రాబోయే రాజకీయ సమీకరణాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. మొత్తానికి గన్నవరం రాజకీయం ప్రస్తుతం అత్యంత రసవత్తరమైన దశకు చేరుకుంది. యార్లగడ్డ వెంకట్రావు దూకుడు వల్ల వంశీ వర్గంలో తీవ్ర ఆందోళన నెలకొంది. అవినీతిని అంతం చేసే వరకు విశ్రమించేది లేదనే సంకేతాలను ప్రస్తుత నాయకత్వం బలంగా ఇస్తోంది. సోషల్ మీడియా ట్రెండ్స్ ప్రకారం చూస్తే ఈ వివాదం ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. ప్రజలు కూడా నిజాలు ఎటువైపు ఉన్నాయో స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారు. రానున్న కాలంలో ఈ పోరు కోర్టుల ద్వారా ఏ మలుపు తిరుగుతుందో చూడాలి. గన్నవరం అభివృద్ధి సాధించాలంటే ఇలాంటి అక్రమాలపై నిరంతరం నిఘా అవసరమని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# పరారీలో వైసీపీ నేతలు

ఏలూరు, గుంటూరు, ఆగస్టు 3, ఆంధ్రప్రదేశ్‌లో చట్టం తన పని తాను చేసుకుపోతుంటే.. వైఎస్సార్‌సీపీ నేతలలో కనిపిస్తున్న భయం, ఆందోళన రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో అధికారంలో ఉన్నప్పుడు చెలరేగిపోయి కేసులు మూటగట్టుకున్న నాయకులు.. ఇప్పుడు విచారణను ఎదుర్కొనే ధైర్యం లేక చాంతాడంత పొడవునా పరారీలో ఉంటున్నారు. ఎక్కువ మంది కొత్త కేసుల్లోనే ఇరుక్కుంటున్నారు. కనిపించకుండా పోతున్నారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు మద్యం రవాణా టెండర్ల అక్రమాల కేసులో సుప్రీంకోర్టు నుంచి ముందస్తు బెయిల్ రాక తీవ్ర షాక్ తగలడం, చింతాడ రవికుమార్, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా వంటి వారు ఎక్కడ ఉన్నారో తెలియక అజ్ఞాతంలోకి వెళ్లిపోవడం ఈ సిరీస్‌లో తాజా పరిణామాలు. తమ్మినేని వంటి కొందరు నేతలు అత్యంత ప్రయాస పడి మధ్యంతర బెయిల్ తెచ్చుకుంటుంటే.. మిగిలిన వారంతా పోలీసుల భయంతో దిక్కుతోచని స్థితిలో నక్కి నక్కి బతుకుతున్నారు.అసలు ఇక్కడ విచిత్రమేమిటంటే.. పోలీసులు వీరిని అరెస్ట్ చేయడానికి పెద్దగా ప్రత్యేక వేట ఏమీ సాగించడం లేదు. అయినప్పటికీ, తమ అక్రమాలు ఎక్కడ వెలుగులోకి వస్తాయోనన్న భయంతో ఫోన్లు కూడా వాడకుండా, రహస్య స్థావరాల్లో దాక్కుంటూ నేతలే సొంతంగా నరకం అనుభవిస్తున్నారు. ఈ ఆధునిక డిజిటల్ యుగంలో ఫోన్ లేకుండా, పరివారానికి దూరంగా, నిరంతరం పోలీసుల సైరన్ వినపడితే ఉలిక్కిపడుతూ అజ్ఞాతంలో గడపడం ఏ రాజకీయ నాయకుడికైనా తీవ్రమైన మానసిక వేదన. ముందస్తు బెయిల్ ఇప్పించాలంటూ కోర్టుల చుట్టూ లాయర్లతో పిటిషన్లు వేయిస్తూ, రోజులు లెక్కిస్తూ బతకడం కంటే పెద్ద శిక్ష మరొకటి ఉండదు.వైసీపీ నాయకత్వం గానీ, ఈ పరారీలో ఉన్న నేతలు గానీ అర్థం చేసుకోవాల్సిన ప్రధానమైన అంశం ఒకటుంది. సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో నిందితులు ఎంతకాలం పారిపోగలరు? ఎక్కడో ఒకచోట ఫోన్ వాడినా, డిజిటల్ ట్రాన్సాక్షన్ చేసినా లేదా మూడో వ్యక్తితో మాట్లాడినా పోలీసులు సులభంగా ట్రాప్ చేయగలరు. అసాధ్యమనే విషయాన్ని గుర్తించకుండా, కోర్టులు ముందస్తు బెయిల్ ఇచ్చే వరకు అజ్ఞాతంలో ఉంటామనడం కేవలం స్వయంకృతాపరాధమే.నిజానికి చట్టాన్ని గౌరవించి ధైర్యంగా వెళ్లి పోలీసుల ముందు లొంగిపోతే .. మహా అయితే రిమాండ్‌కు పంపి జైలులో పెడతారు.

# టీటీడీ ఫేక్ వెబ్‌సైట్ కలకలం..!

తిరుమల, ఆగస్టు 3, కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి దర్శనం కోసం వేచి చూసే అమాయక భక్తులను టార్గెట్ చేస్తూ సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. తిరుమల తిరుపతి దేవస్థానం పేరుతో సరికొత్తగా ఒక నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. అనే పేరుతో చలామణి అవుతున్న ఈ నకిలీ వెబ్‌సైట్ వ్యవహారం ప్రస్తుతం భక్తులలో తీవ్ర కలకలం రేపుతోంది. టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ఏ విధంగా ఉంటుందో, అచ్చం అదే తరహా డిజైన్, రంగులు మరియు ఫోటోలను ఉపయోగించి సైబర్ కేటుగాళ్లు

ఈ నకిలీ వెబ్‌సైట్‌ను రూపొందించడం గమనార్హం.ఈ నకిలీ వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం , వివిధ రకాల సేవా టికెట్లు మరియు తిరుమలలో వసతి గదుల బుకింగ్స్ పేరుతో భక్తులను నమ్మించి మోసగించడానికి నేరగాళ్లు ప్రయత్నిస్తున్నారు. టీటీడీ అధికారిక కోటా విడుదల కాని సమయంలో కూడా ఈ సైట్‌లో టికెట్లు అందుబాటులో ఉన్నట్లు చూపిస్తూ భక్తుల నుండి భారీగా డబ్బులు వసూలు చేసేందుకు వల విసిరారు. ఇంటర్నెట్‌లో నిజమైన సైట్ ఏదో తెలియక చాలా మంది భక్తులు ఈ ఫేక్ లింక్‌లను క్లిక్ చేసి తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను నమోదు చేసి మోసపోయే ప్రమాదంలో పడ్డారు.ఈ నకిలీ వెబ్‌సైట్ ఉదంతంపై తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తీవ్రంగా స్పందించారు. ఇలాంటి నకిలీ వెబ్‌సైట్లను భక్తులు ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మవద్దని, సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ లింక్‌ల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని గట్టి హెచ్చరికలు జారీ చేశారు. శ్రీవారి దర్శన టికెట్లు, లడ్డూలు లేదా వసతి గదుల బుకింగ్ కోసం కేవలం అధికారిక వెబ్‌సైట్ అయిన 'బిబిటవలజీబబిష్ట్రజీనిజీఎబ.జీజూ.ఇనీల.తిని' లేదా అధికారిక మొబైల్ యాప్‌ను మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. ఈ నకిలీ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్న సైబర్ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐటీ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# కంచుకోటలో సవాళ్లు....

అనంతపురం, ఆగస్టు 3, ఉమ్మడి అనంతపురం జిల్లా ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ కి కంచు కోటగా గుర్తింపు పొందింది. రాజకీయ పరిస్థితులు ఎలా మారినా ఈ ప్రాంతంలో పార్టీ తన ప్రభావాన్ని నిలబెట్టుకుంది. 2019 ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ భారీ విజయాన్ని నమోదు చేసినప్పటికీ, హిందూపురం , ఉరవకొండ వంటి నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపు సాధించింది. 2024 ఎన్నికల్లో కూడా జిల్లా వ్యాప్తంగా పార్టీ మరింత బలపడింది. అయితే ఇప్పుడు జిల్లాలో పార్టీ నాయకత్వం ఆశించినంత చురుకుగా కనిపించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఇటీవల రాజకీయ కార్యక్రమాల్లో పెద్దగా కనిపించడం లేదని కార్యకర్తల మధ్య చర్చ జరుగుతోంది. మంత్రి పదవులు లేదా ఇతర కీలక బాధ్యతలు ఆశించిన కొందరికి అవి దక్కకపోవడం, నామినేటెడ్ పోస్టుల భర్తీలో జాప్యం జరగడం వంటి అంశాలు ఈ పరిస్థితికి కారణమయ్యాయనే ప్రచారం ఉంది. అధికారంలో ఉన్నప్పటికీ నాయకులు సమన్వయంతో ముందుకు సాగకపోవడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వం తమ తమ వర్గాలకే పరిమితమవుతోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో పార్టీ కార్యక్రమాలు ఒకే దిశగా సాగడం లేదని పరిశీలకులు చెబుతున్నారు. నాయకుల మధ్య సమన్వయం బలహీనంగా ఉండటం వల్ల కేడర్‌లో కూడా కొంత నిరుత్సాహం కనిపిస్తోందని స్థానికంగా చర్చ జరుగుతోంది.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించిన ఇంటింటికీ కార్యక్రమాన్ని జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఒకే స్థాయిలో అమలు చేయడం లేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ , కాల్వ శ్రీనివాసులు ప్రాతినిధ్యం వహిస్తున్న రాయదుర్గం నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం కొంత చురుకుగా సాగుతున్నప్పటికీ, మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం ఆశించిన వేగం కనిపించడం లేదని పార్టీ వర్గాలే అంటున్నాయి.చాలా చోట్ల ఇంటింటికీ కార్యక్రమం కంటే సమావేశాలు, సమన్వయ చర్చలు, కార్యకర్తల నియామకాలపైనే ఎక్కువ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ప్రజల్లో పార్టీ కార్యక్రమాల ప్రభావం తగ్గే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎక్కువ మంది సీనియర్ నాయకులు ఉండటం కూడా సమన్వయానికి సవాలుగా మారిందని అంటున్నారు. ప్రతి నాయకుడు తన రాజకీయ ప్రాధాన్యతను నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో ఉండటంతో కొన్ని చోట్ల అంతర్గత పోటీ పెరిగినట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతల మధ్య అభిప్రాయ భేదాలు కూడా అప్పుడప్పుడు బయటపడుతున్నాయని సమాచారం.ముఖ్యంగా తాడిపత్రి, హిందూపురం , పెనుకొండ వంటి కీలక నియోజకవర్గాల్లో స్థానిక రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి. ఈ పరిస్థితులను పార్టీ అధిష్ఠానం సమయానికి చక్కదిద్ది, నాయకత్వం మరియు కేడర్‌ను ఒకే వేదికపైకి తీసుకురాగలిగితే జిల్లా స్థాయిలో పార్టీ మరింత బలోపేతం అయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## తల్లిపాల వారోత్సవాలు లో భాగంగా మూడవరోజు అంగన్వాడి సెంటర్ లో తల్లుల సమావేశం...



విభారే న్యూస్ ఆగస్టు 3 ఎమ్మిగనూరు..ఎమ్మిగనూరు ప్రాజెక్ట్ పరిధిలో సిడిపిఓ మేడం ఆదేశానుసారం తల్లిపాల వారోత్సవాలు ఆగస్టు ఒకటి నుంచి ఏడు వరకు అవగాహన కార్యక్రమాలు సందర్భంగా సోమవారం అర్బన్ అంగన్వాడి సెంటర్లలో తల్లులందరిని సమావేశపరిచి ముర్రుపాల ప్రాముఖ్యత మరియు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి తల్లులందరికీ అవగాహన కల్పించడం జరిగింది బిడ్డకు తల్లి పాలు పట్టడం వల్ల బిడ్డకే కాకుండా తల్లికి కూడా లాభాలు ఉన్నాయి అవి ఏమనగా బిడ్డకు పాలు పట్టడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుంది, బిడ్డకు బిడ్డకు మధ్య దూరం ఉంటుంది అలాగే తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లులందరితో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది ఈ సమావేశానికి సూపర్వైజర్లు నాగలక్ష్మి భాగ్యలక్ష్మి అంగన్వాడీ టీచర్లు గోవర్ధనమ్మ హస్మత్ గౌసియాబేగం మంజుల నిర్మల కైరును షాహిన్ సరోజ ఏఎన్ఎం లక్ష్మి ఆశా లక్ష్మి, గర్భిణీలు బాలింతలు తల్లులు కిశోర బాలికలు అందరు కూడా హాజరు కావడం జరిగింది.

## ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీని వినియోగించుకోండి--

### ఉద్యోగులకు కలెక్టర్ రాజకుమారి సూచన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 3:ప్రభుత్వ ఉద్యోగులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అందిస్తున్న స్టేట్ గవర్నమెంట్ శాలరీ ప్యాకేజీ (ఎస్‌జీఎస్‌పీ) ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో డి. రాము నాయక్, ఎస్‌బీఐ నూనెపల్లె శాఖ మేనేజర్ రవితేజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఉద్యోగులు తమ జీత ఖాతాలను ఎస్‌జీఎస్‌పీ కింద నమోదు చేసుకుంటే కనీస నిల్వ అవసరం లేకుండా ఉచిత బ్యాంకింగ్ సేవలు, బీమా రక్షణ, రుణాలపై రాయితీలు వంటి ప్రయోజనాలు పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. అలాగే తక్కువ ప్రీమియంతో ఆరోగ్య బీమా సదుపాయం కూడా అందుబాటులో ఉందన్నారు.జీతంలో కొంత మొత్తాన్ని ఫ్లెక్సీ డిపాజిట్‌లో ఉంచడం ద్వారా సాధారణ సేవింగ్స్ ఖాతాతో పోలిస్తే అధిక వడ్డీ లభిస్తుందని, అవసరమైనప్పుడు ఆ మొత్తాన్ని సులభంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఉద్యోగులు పే స్లిప్, ఆధార్, పాన్, ఉద్యోగ గుర్తింపు కార్డుతో సమీప ఎస్‌బీఐ శాఖలో శాలరీ ప్యాకేజీకి నమోదు చేసుకోవాలని సూచించారు.

## ఇసుకపల్లిలో నేటి నుంచి తితిదే ధార్మిక కార్యక్రమాలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 03-తిరుమల తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శిరివెళ్ల మండలం ఇసుకపల్లి గ్రామంలోని శ్రీ శివరామాలయంలో మంగళవారం నుంచి శనివారం వరకు ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి ధార్మిక ప్రవచనాలు, భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. శుక్రవారం గో పూజ, కుంకుమార్చన, శనివారం ప్రత్యేక భజన కార్యక్రమాలు ఉంటాయని



చెప్పారు. ఈ సందర్భంగా కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను స్థానిక భక్తులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ భక్తులు పాల్గొన్నారు.

## పెద్దచెరువు సుందరీకరణకు శంకుస్థాపన--

### పట్టణ అభివృద్ధిలో మరో కీలక ముందడుగు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 3:నంద్యాల పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించే లక్ష్యంతో చేపట్టనున్న పెద్దచెరువు సుందరీకరణ పనులకు సోమవారం ఘనంగా శంకుస్థాపన నిర్వహించారు. రాష్ట్ర న్యాయ, న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ ముఖ్య అతిథిగా పాల్గొని పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, కే.సీ. కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బి. రామలింగారెడ్డి, ఇన్‌చార్జి సూపరింటెండింగ్ ఇంజనీర్ జి. శైలేశ్వర్, నంద్యాల మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న, కే.సీ. కెనాల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి. ప్రతాప్ తదితర అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ, పెద్దచెరువు సుందరీకరణతో నంద్యాల పట్టణానికి కొత్త అందం చేకూరుతుందని తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకరమైన విహార ప్రదేశంగా తీర్చిదిద్దడంతో పాటు పర్యాటక అభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, నీటిపారుదల శాఖ అధికారులు, వివిధ శాఖల ఇంజనీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వ్యవసాయ పరిశోధనకు రైతుల సహకారం అవసరం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 03-వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రైతుల పొలాల్లో నిర్వహిస్తున్న పరిశోధన కార్యక్రమాలకు రైతులు సహకరించాలని డాక్టర్ వి. జయలక్ష్మి కోరారు. పరిశోధనల్లో రైతుల భాగస్వామ్యంతో కొత్త సాగు పద్ధతులు, మెరుగైన వంగడాలు, దిగుబడి పెంపు, ఖర్చు తగ్గింపు వంటి అంశాలపై శాస్త్రీయ సమాచారం అందుతుందని తెలిపారు.వ్యవసాయ సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు కనుగొనేందుకు రైతులు పరిశోధనల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కె. భాస్కర్, డాక్టర్ కె. అశోక్ కుమార్, డాక్టర్ బి.వి.ఆర్. ప్రకాష్ రెడ్డి, డాక్టర్ పి. పుల్లిబాబు, డాక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్‌లో 149 ఫిర్యాదులు--

### ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి అధికారులకు ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 3:జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్, ఐపీఎస్ ప్రజల నుంచి 149 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, చట్టపరిధిలో న్యాయబద్ధంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.సంబంధిత పోలీసు అధికారులకు ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వానికి తావివ్వకుండా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి సకాలంలో పంపించాలని ఆదేశించారు.ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసు శాఖ దృష్టికి తీసుకురావాలని, వేగవంతమైన, పారదర్శక సేవలందించడమే పీజీఆర్ఎస్ లక్ష్యమని ఎస్పీ తెలిపారు.

## మీ భూమి–మీ హక్కు కార్యక్రమంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 3: నంద్యాల మండలం కానాలలో నిర్వహించిన “మీ భూమి?మీ హక్కు” కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ రైతులకు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుజయ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి రైతుకు భూమిపై పూర్తి హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పారదర్శకంగా పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నామని, వీటి ద్వారా రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను సులభంగా పొందవచ్చని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆర్డీవో విశ్వనాథ్, తహసీల్దార్ శ్రీవాణి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, టిడిపి మండల కన్వీనర్ మునగాల విశ్వనాథ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## శ్రీశైలం జల సంరక్షణకు విజ్ఞప్తి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 3:రాయలసీమలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో శ్రీశైలం జలాశయంలో జల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేసింది.సోమవారం సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ, తాగునీరు, పశువుల తాగునీరు, ఆరుతడి పంటలకు అవసరమైన నీటిని అందించేందుకు మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీ?నీవాకు, పోతిరెడ్డిపాడు ద్వారా ఎస్ఆర్‌బీసీ, కేసీ కాలువ, తెలుగు గంగ, గాలేరు?నగరి ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయాలని కోరారు. శ్రీశైలంలో ప్రతి టీఎంసీ నీటిని సంరక్షించడం రాయలసీమ ప్రజల తాగునీటి భద్రతకు, రైతాంగ మనుగడకు కీలకమని తెలిపారు.

## ప్రజా వినతుల పరిష్కారంలో వేగం పెంచాలి--

### పీజీఆర్ఎస్‌లో 405, రెవెన్యూ క్లినిక్‌లలో 211 దరఖాస్తులు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 3:ప్రజల నుంచి వచ్చే వినతులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో రాము నాయక్ తదితరులతో కలిసి ఆమె సమీక్ష నిర్వహించారు.రీఓపెన్ అయిన 5,397 దరఖాస్తుల్లో 5,376 పరిష్కరించగా, మిగిలిన 21 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అధికారుల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న 348 దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చే వినతులకు ప్రాధాన్యం ఇవ్వాలని, పనితీరు సూచికల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని తెలిపారు.ఈ వారం పీజీఆర్ఎస్‌లో 405, రెవెన్యూ క్లినిక్‌లలో 211 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ వెల్లడించారు. భూ సమస్యలను గ్రామస్థాయిలోనే వేగంగా పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్‌లు ఉపయోగపడుతున్నాయని ఆమె పేర్కొన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నేడు షష్టి సందర్భంగా సుబ్రమణ్య స్వామికి విశేష పూజలు..

విభారే న్యూస్ ఆగస్టు 3 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురు దత్త శ్రీ గురు దత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి దివ్య ఆశీస్సులతో శ్రీ సూర్య నారాయణ స్వామి దేవాలయంలో ఈరోజు షష్టి కలసి ఉన్న శుభ సందర్భం అత్యంత యోగ దాయకం.ఈ సందర్భంగా శ్రీ షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి వారికి అత్యంత విశేషంగా పూజలు, అర్చనలు,సర్ప సూక్త విధానంగా పంచామృత అభిషేకాలు జరుగును. వివాహ సమస్యలు,భూ సమస్యలు,సంతాన సమస్యలు ఉన్నవారు ఈరోజు శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆరాధన ద్వారా తమ సమస్యలను దూరం చేసుకోగలరు.ఈరోజు స్వామి వారి ఆరాధన విశేష ఫలితాన్నిస్తుంది..పంచామృత అభిషేకం – 200/–మాసపూజ – 300/–నిత్య పూజ – 3000/–సంప్రదించండి :–శ్రీధర్ శర్మ – 7995202082గూగుల్ పే ఫోన్ పే నెంబరు..8896123777 ఆఫీసు ల్యాండ్ ఫోను నెంబరు..08518–234388



## నేడు శాకాంబరి అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీ గాయత్రీ దేవి..

విభారే న్యూస్ ఆగస్టు 3 ఎమ్మిగనూరు..స్థానిక గీతానగర్లో వెలసిన శ్రీ వేద గాయత్రి మాత ఆలయంలో ఆషాయ మాసంను పురస్కరించుకొని నేడు శాకాంబరి అలంకారంతో గాయత్రీ దేవిని అలంకరిస్తారు.ఆలయ అర్చకులు బలకుంది నరహరి శాస్త్రి చే అలంకారం గావించబడును. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ అర్చకులు తెలిపారు.




## ఎమ్మార్పీఎస్ టౌన్ కమిటీ నియామకం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 3:ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, జాతీయ నాయకుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నంద్యాల టౌన్ ఇన్‌చార్జిగా గద్దల సామేలు మాదిగను నియమించారు. టౌన్ కో–ఇన్‌చార్జులుగా పుసులూరు పుల్లయ్య మాదిగ, రాము మాదిగలను ఎంపిక చేశారు.వీరి ఆధ్వర్యంలో త్వరలో టౌన్, మండల కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ రాజు నాయక్, లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ పుల్లన్న, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు పేరపోగు జోసఫ్, మహిళా జిల్లా నాయకురాలు నందిని, బాలు, సాయి, శ్రీనివాస్, చంద్ర, హరి తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190